క్లుప్తంగా

మహిళల భద్రత కోసమే షీటీమ్



కాశిబుగ్గ: మహిళలు, బాలికల భద్రత కోసమే షీటీమ్ పని చేస్తోందని, ఈక్రమంలో షీటీమ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని షీటీమ్ ఎస్సై విద్యాసాగర్ సూచించారు. ఈమేరకు షీటీమ్ సేవలపై ఎల్‌బీనగర్ చార్‌బౌలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ లైంగిక వేధింపులకు గురైన బాధితులు 100 టోల్‌ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. ఉపాధ్యాయులు హరికృష్ణ, తిలక్, నరసింహారావు, రమేష్, శ్రీనివాస్ నవీన్‌కుమార్, నీరజ, లక్ష్మి, స్వప్న పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో సంక్రాంతి సంబరాలు



కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండలోని శ్రీచైతన్య పాఠశాల ఆవరణలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు సంప్రదాయ వస్త్రధారణతో హాజరై, భోగి మంటలు, అందమైన రంగవల్లులు వేశారు. బొమ్మల కొలువులు, వరినాట్ల వంటి కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్లు శ్రీవిద్య, శ్రీధర్, డీజీఎం చేతన్, ఆర్ఐ రాంకీ, కోఆర్డినేటర్ మహేష్, బ్రాంచి ప్రిన్సిపాల్ నవీన్, డీన్ రాజిరెడ్డి, ఏఓ ప్రణయ్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కేయూసీ రోడ్డులోని ఏకశిలలో..



నయీంనగర్: కేయూసీ రోడ్డులోని ఏకశిల హైస్కూల్‌లో బుధవారం సంక్రాంతి పండుగ వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో హాజరై రంగురంగుల ముగ్గులు వేసి వాటి మధ్య గొబ్బెమ్మలు, రేగుపండ్లు, నవధాన్యాలు, బంతిపూలు, చెరుకుగడలు ఉంచి అలంకరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ బేతి కొండల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బేతి శైలజారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నీల సుష్మారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పండ్లు, కూరగాయలతోనే ఆరోగ్యం



ఖిలా వరంగల్: విద్యార్థులు ఆహారంతో పాటు పోషక విలువలున్న పండ్లు, కూరగాయలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని కరీమాబాద్ రోడ్డులోని న్యూ కౌటిల్యాస్ స్కూల్ కరస్పాండెంట్ కోడం శ్రీధర్ తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కోడం సబిత ఆధ్వర్యంలో వెజిటేబుల్, ఫ్రూట్స్ డేను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, వ్యాపారులు, ఇతర వేషధారణలతో చిన్నారులు అలరించారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు



రామన్నపేట: మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని ఎల్‌బీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్.రావు అన్నారు. కళాశాలలో ఇంటర్మీడియట్ అంతర తరగతుల మధ్య క్రీడాపోటీలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని తెలిపారు. క్రీడల కన్వీనర్, ఫిజికల్ డైరెక్టర్ బి.ప్రభాకర్ మాట్లాడుతూ క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, క్యారమ్స్, ఖోఖో, అథ్లెటిక్స్ క్రీడలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పోటీలు ఈనెల 20 వరకు కొనసాగుతాయని వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.రాజేందర్‌రెడ్డి, ఇంటర్ కోఆర్డినేటర్ వి.మధుకర్‌రావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో రైల్వేగేట్ ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్‌లపై ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈనెల 17నుంచి స్టేషన్ పరిధిలో డ్రైవింగ్ లైసెన్స్‌లపై ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈక్రమంలో లైసెన్స్ లేకుంటే ఆటో సీజ్‌చేసి డ్రైవర్‌పై కేసులు నమోదు చేస్తామని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు శ్రీలత, సుమన్, కుమార్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించదగిన మహనీయుడు శాస్త్రి



కాజీపేట రూరల్: నివాళులర్పిస్తున్న నాయకులు



హన్మకొండ: హనుమాన్‌నగర్‌లో..

కాజీపేట రూరల్: దేశం గర్వించదగిన మహనీయుడు దేశ మాజీ ప్రధాని, తొలి రైల్వే మంత్రి లాల్‌బహదూర్ శాస్త్రి అని తెలంగాణ రైల్వే ఎంప్లాయిస్ జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, ట్రెజరర్ చింత తిరుపతి కొనియాడారు. శాస్త్రి 56వ వర్ధంతిని పురస్కరించుకొని కాజీపేట రైల్వే ఈఎల్ఎస్ కాలనీలో బుధవారం రాత్రి కొవ్వొత్తులు వెలిగించి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో మహబూబ్‌నగర్‌లో జరిగిన రైలు ప్రమాదానికి బాధ్యత వహిస్తూ శాస్త్రి తన పదవికి రాజీనామా చేశారని గుర్తుచేశారు. ప్రధానిగా ఉన్న సమయంలో జై జవాన్, జై కిసాన్ నినాదంతో దేశరక్షణ కోసం పాకిస్తాన్‌తో యుద్ధం చేసి విజయం సాధించారని కొనియాడారు. కార్యక్రమంలో రైల్వే జేఏసీ నాయకులు పాక వేదప్రకాష్, జి.భాస్కర్, కె.సాయిరాజ్, రైల్వే ఇన్‌స్టిట్యూట్ జాయింట్ సెక్రటరీ ఎం.రాజయ్య, ట్రెజరర్ జి.రాజేశ్వర్, ఎస్.ప్రవీణ్, బి.మాధవరావు, ఎస్.శ్రీనివాస్, కార్మికులు పాల్గొన్నారు.

లాల్ బహదూర్ శాస్త్రికి నివాళి

హన్మకొండ: మాజీ ప్రధానమంత్రి, స్వాతంత్య్ర సమరయోధుడు, భారతరత్న అవార్డు గ్రహీత లాల్ బహదూర్ శాస్త్రి వర్ధంతిని హనుమాన్‌నగర్–1లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చల్ల వెంకటేశ్వర్ రెడ్డి, కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు సాదుల రఘుపతి, కుమార్‌రెడ్డి, సిరిమల్లె ప్రవీణ్, మాదారపు ఉదయ్ కిరణ్, చిర్ర శ్రవణ్, మొట్ల వెంకటేష్, గుంటి శ్రీను, రాఘవ రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధి ద్వారానే మహిళా సాధికారత



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ డేవిడ్‌రాజు

హన్మకొండ: మహిళలు ఆర్థికంగా నిలదొక్కుంటే మహిళా సాధికారత సాధ్యమని వరంగల్ పోలీసు కమిషనరేట్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ ఏసీపీ పి.డేవిడ్ రాజు అన్నారు. హనుమకొండ సుబేదారిలో ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో వనం మహిళా సహకార సంఘం 15వ సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. సంఘం అధ్యక్షురాలు మేరీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏసీపీ డేవిడ్ రాజు మాట్లాడుతూ పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు కృషి చేస్తున్నా లక్ష్యాలను సాధించలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ సిస్టర్ రెజీనా చిన్నప్ప, వనం మహిళా సహకార సంఘం ముఖ్య కార్యనిర్వాహణ అధికారి సిస్టర్ నిర్మల, వరంగల్ షీటీమ్స్ సబ్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్, సైబర్ సేఫ్టీ విభాగం కానిస్టేబుల్ రాజు, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ బత్తుల కరుణ పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని వీసీకి వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పనిచేస్తున్న దినసరి వేతన లంప్సమ్ ఉద్యోగులకు వేతనాలు పెంచాలని తెలంగాణ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు కోరారు. ఈమేరకు కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌లను బుధవారం వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఆరేళ్ల నుంచి వేతనాలు పెంచలేదని పేర్కొన్నారు. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఆయా ఉద్యోగులకు అర్హతను బట్టి పదోన్నతులను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, తెలంగాణ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టు రవి, ఉపాధ్యక్షుడు చిరంజీవి, బాధ్యులు రామచందర్, రవి, రవికుమార్, ఎం.రాజేందర్, గాజు రాజు, నయీం, మధు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైష్ణవాలయాల్లో కుడారై ఉత్సవాలు



నీలా వేంకటేశ్వరస్వామి



చైతన్యపురిలో..

హన్మకొండ కల్చరల్: ధనుర్మాసోత్సవంలో భాగంగా నగర వ్యాప్తంగా పలు వైష్ణవ సంప్రదాయ దేవాలయాల్లో కుడారై ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పలు దేవాలయాల్లో స్వామివారికి పాయస నివేదనలు చేశారు. వరంగల్‌లోని శ్రీబాల వేంకటేశ్వరస్వామి దేవాలయంలో, గోపాలస్వామి గుడి, కాశిబుగ్గ రంగనాథస్వామి ఆలయం, గీతాభవన్, గోవిందరాజుల గుట్ట, హనుమకొండలోని సీతారామచంద్రస్వామి కోవెల, రెవెన్యూ కాలనీ రామాలయం, రెడ్డికాలనీ అభయాంజనేయస్వామి దేవాలయం, అదాలత్ వెనుకగల శ్రీదేవి భూదేవి సహిత నీలా వేంకటేశ్వరస్వామి, ఎక్సైజ్ కాలనీ, టీచర్స్‌కాలనీ, ఎన్జీఓ కాలనీలలోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివారికి పాయస పరమన్నాలు నివేదించారు.

కాజీపేట చైతన్యపురి కాలనీలో..

కాజీపేట: చైతన్యపురి కాలనీలోని గోదాదేవి, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం కుడారై వేడుకలు నిర్వహించారు. ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకుని ఆలయ అర్చకుడు రఘురామాచార్యులు ఆధ్వర్యంలో వేంకటేశ్వరుడికి 108 రకాల ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుల నేతృత్వంలో దేవతామూర్తులకు ప్రత్యేక అలంకరణ చేసి కుడారై ఉత్సవ విశిష్టతలను భక్తులకు వివరించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పంజాల అశోక్‌కుమార్ గౌడ్, మేజర్ వడ్డెపల్లి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ డేవిడ్ రాజు

కాజీపేట: జల్సాలకు అలవాటు పడి తాళం వేసి ఉన్న ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు క్రైం ఏసీపీ డేవిడ్‌రాజు తెలిపారు. క్రైం సీసీఎస్ పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా మందమర్రి ప్రాంతానికి చెందిన పాత నేరస్తుడైన టేకం రాము(22).. నగరంలో తాళం వేసి ఉన్న ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డాడు. కాగా, నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ.5వేల నగదు, రూ.18వేల విలువ గల సెల్‌ఫోన్, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ వివరించారు. సమావేశంలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు ఎల్.రమేష్‌కుమార్, కె.శ్రీనివాస్‌రావు, ఐటీ కోర్ కిటీ సభ్యుడు ఎండి సల్మాన్‌పాషా, ఎస్సై సుమన్, సంపత్ కుమార్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

కాజీపేట: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఎనిమిది మంది వాహనదారులకు జరిమానా విధించారు. వారిని కోర్టులో బుధవారం హాజరుపర్చగా ఇద్దరికి రెండు రోజుల జైలుశిక్ష, ఆరుగురికి రూ.8,800 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి రమేష్‌బాబు తీర్పునిచ్చారని ట్రాఫిక్ సీఐ రవికుమార్ తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

వరంగల్ లీగల్: వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా కోర్టు ప్రాంగణంలో వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు కోక రాధాదేవి, కృష్ణమూర్తి బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్కుర్తి ఆనందమోహన్, ప్రధాన కార్యదర్శి గునిగంటి శ్రీనివాస్‌గౌడ్, జాయింట్ సెక్రటరీ పాలిశెట్టి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హన్మకొండ అర్బన్: హనుమకొండ జిల్లాలోని శాయంపేట మండలం పెద్దకోడపాక రెవెన్యూ పరిధిలోని 632, 633 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమికి హద్దులు నిర్ణయించి పరిరక్షించాలని సీపీఎం జిల్లా కన్వీనర్ బొట్ల చక్రపాణి కోరారు. ఈమేరకు నాయకులతో కలిసి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు బుధవారం వినతిపత్రం అందించారు. అనంతరం చక్రపాణి మాట్లాడుతూ పెద్దకోడపాక రెవెన్యూ పరిధిలో రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములున్నాయని, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అవి అన్యాక్రాంతమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీ అండదండలతో కొంతమంది భూకబ్జాదారులు ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారని వాపోయారు. అధికారులు స్పందించి ప్రభుత్వ భూములకు హద్దులు నిర్ణయించి, నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు ఎం.చుక్కయ్య, శాయంపేట మండల నాయకులు మంద సురేష్ పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి 'సీఎంఆర్‌ఎఫ్' ధీమా



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే రమేష్

హసన్‌పర్తి: పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్) పథకం ఎంతో ధీమా అని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న హసన్‌పర్తి మండలం మడిపల్లికి చెందిన బుర్ర రాజమౌళికి రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని హనుమకొండలోని తన స్వగృహంలో ఎమ్మెల్యే బుధవారం అందించారు. కార్యక్రమంలో రైతుబంధు మండల కోఆర్డినేటర్ అంచూరి విజయ్, ఎంపీటీసీ సభ్యుడు ఇంద్రయ్య, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు రాజు, సోషల్ మీడియా అధ్యక్షుడు తుమ్మ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డీపీఓ

వరంగల్ జిల్లా డీపీఓగా బాధ్యతలు స్వీకరించిన కల్పన.. వర్ధన్నపేట ఎమ్మెల్యే రమేష్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రశాంత్‌నగర్‌లోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి బొకే అందించారు.

జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక



ప్రకాష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండలోని మైనార్టీ గురుకుల పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థి బి.ప్రకాష్ జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ టి.శ్రీనివాస్ తెలిపారు. కడిపికొండలోని మైనార్టీ గురుకుల పాఠశాల ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల నల్గొండ జిల్లాలో రాష్ట్రస్థాయి నిర్వహించిన పోటీల్లో పాఠశాలకు చెందిన ప్రకాష్ పాల్గొని ప్రతిభ కనబరిచారని చెప్పారు. విజయవాడలో ఈనెల 12, 13 తేదీల్లో నిర్వహించనున్న 41వ జూనియర్ సౌత్‌జోన్ జాతీయ స్థాయి షూటింగ్‌బాల్ ఛాంపియన్ షిప్ టోర్నమెంట్‌లో పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రకాష్‌ను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

మహిళలు రాజకీయాల్లో రాణించాలి



ముగ్గులను పరిశీలిస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: పురుషులతో సమానంగా మహిళలు రాజకీయాలతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాషుమియా సూచించారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా శివనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి రోహల ఆధ్వర్యంలో మహిళలకు బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ మార్పుకోసం మహిళలు పిడికిలి బిగించి రాజకీయాల్లో అడుగుపెట్టాలని సూచించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత తామందరిపై ఉందని గుర్తుచేశారు. అనంతరం, ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబర్చిన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో దండు లక్ష్మణ్, గన్నారపు రమేష్, బద్రి, జన్ను రవి, భవాని, సౌందర్య, విజయలక్ష్మి, ప్రవళిక, సుప్రియ, దివ్య, రజిత, సుమలత, దేవిక పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టాలి

హన్మకొండ: బిహార్ రాష్ట్రంలో ప్రత్యేకంగా బీసీ కులగణన చేపట్టిన విధంగానే తెలంగాణలోనూ బీసీ కులగణన చేపట్టాలని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు కోరారు. ఈమేరకు సీఎం కేసీఆర్‌కు రాసిన లేఖను హనుమకొండలో తపాలా డబ్బాలో బుధవారం పోస్టు చేశారు.

రైల్వే అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉంది

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. కాజీపేట 47వ డివిజన్‌లో ఇంటింటి బీజేపీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. 47వ డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన ప్రచారంలో ఆమె పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

మడికొండ: మడికొండ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ గుజుల తరుణ్ (24) ఇటీవల మృతి చెందగా, బుధవారం దశ దినకర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు తోటి ఆటో డ్రైవర్లు రూ.6వేలు అందజేశారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

కేయూ క్యాంపస్: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని ప్రభుత్వ మార్కజీ పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఆ పాఠశాలలో నెలకొన్న నీటి సమస్య అతడి దృష్టికి రావడంతో సొంతఖర్చులతో నీటి సౌకర్యం కల్పించారు.

లారీ ఓనర్ల పొట్ట కొట్టొద్దు

ఖిలా వరంగల్: నగరంలోని లారీలను పక్కనపెట్టి ఇతర రాష్ట్రాలకు చెందిన లారీలకు లోడింగ్‌కు అనుమతించి, స్థానిక లారీ యజమానుల పొట్టలు కొట్టొద్దని వరంగల్ జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేముల భూపాల్ అన్నారు.

శ్రీనిధి కళాక్షేత్రం చిన్నారులకు అవార్డులు

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గ శ్రీనిధి కళాక్షేత్రం చిన్నారులు జానపద, శాస్త్రీయ నృత్య పోటీల్లో ప్రతిభ కనబర్చి అవార్డులు గెలుచుకున్నారని కళాక్షేత్రం డైరెక్టర్ సరితాశ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా వారికి బుధవారం అభినందించారు.

క్రీడాకారులకు జెర్సీల పంపిణీ

హన్మకొండ: క్రీడాకారులకు బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ జెర్సీ (టీషర్ట్)లు పంపిణీ చేశారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో శ్రీగురుతేజ్ బహదూర్ స్పోర్ట్స్ క్లబ్‌కు చెందిన 15మంది క్రికెట్ క్రీడాకారులకు టీషర్టులను రావు పద్మ అందించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

హసన్‌పర్తి: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని 2వ డివిజన్ వంగపహాడ్‌లో అరూరి గట్టుమల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు బుధవారం ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు మాజీ కార్పొరేటర్ బానోతు కల్పన బహుమతులు ప్రదానం చేశారు.

గన్‌మెన్ల ఉపసంహరణ గర్హనీయం

కాకోజీ సెంటర్: బీజేపీ నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావుకు గన్‌మెన్లను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవడం గర్హనీయమని పార్టీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్ అన్నారు.

బాపూజీనగర్ ట్రైసిటీ ఆటో కార్యవర్గం

కాజీపేట రూరల్: కాజీపేట బాపూజీనగర్ అడ్డా ట్రైసిటీ ఆటో యూనియన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముచ్చు భిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా కందుకూరి కృష్ణంరాజు, కోశాధికారిగా జెర్రిపోతుల వెంకన్న ఎన్నికయ్యారు.

యువజన ఉత్సవాలకు వరంగల్ వలంటీర్లు

కరీమాబాద్: కర్ణాటకలోని హుబ్లీధార్వాడ్ నగరంలో జరుగుతున్న 26వ జాతీయస్థాయి యువజన ఉత్సవాల్లో నెహ్రూ యువ వరంగల్ వలంటీర్లు పాల్గొన్నారు. వివేకానంద జయంతి సందర్భంగా జనవరి 12నుంచి వారం పాటు నిర్వహిస్తున్న వేడుకలకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 25మంది ఎంపికయ్యారని జిల్లా నెహ్రూ యువకేంద్రం ఆఫీసర్ చింతల్ అన్వేష్ తెలిపారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

నయీంనగర్: యువత నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని కిషన్‌పురలోని సీడీయూ వీసీ ప్రొఫెసర్ దామోదర్ సూచించారు. స్వామి వివేకానంద జీవిత విశేషాలను తెలుసుకోవాలని చెప్పారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వరంగల్: వరంగల్ బ్యాంక్ కాలనీకి చెందిన నామోజు శ్రీధర్ – రమాదేవి దంపతుల కుమారుడు శివతేజ (20) ఈనెల 1న అనుమానాస్పదంగా మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను తూర్పు ఎమ్మెల్యే నరేందర్ పరామర్శించారు.

టీఆర్‌హెచ్‌ఎస్‌ఎస్ జెండా ఆవిష్కరణ

హన్మకొండ అర్బన్: తెలంగాణ రైతు హక్కుల సాధన సమితి (టీఆర్‌హెచ్‌ఎస్‌ఎస్) జెండాను హయగ్రీవాచారి మైదానంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలు యాదవ్ బుధవారం ఆవిష్కరించారు.

శాంతికుమారిని కలిసిన వాసుదేవరెడ్డి

హన్మకొండ: రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా నియమించబడిన శాంతికుమారిని రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి బుధవారం కలిశారు.

టీఎస్ ఐసెట్ కన్వీనర్‌కు అభినందన

కేయూ క్యాంపస్: టీఎస్ ఐసెట్ కన్వీనర్‌గా నియమితులైన కేయూ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వరలక్ష్మిని కళాశాలలో కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌కుమార్‌లోథ్, బాధ్యులు అభినందించారు.

కళాశాలలోని సమస్యలు పరిష్కరించాలి

ఖిలా వరంగల్: రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న తాగునీరు, మరుగుదొడ్ల సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ల్యాదల్ల శరత్ కోరారు. ఈమేరకు ఎమ్మెల్యే నరేందర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఫార్వర్డ్ బ్లాక్ మహాసభలను జయప్రదం చేయండి

వరంగల్: ఫిబ్రవరి 23నుంచి 26వరకు హైదరాబాద్‌లో జరగనున్న జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర అధ్యక్షుడు, ఫార్వర్డ్ బ్లాక్ గ్రేటర్ వరంగల్ ఇన్‌చార్జ్ హకీమ్ నవీద్ పిలుపునిచ్చారు. ఈమేరకు పోచమ్మ మైదాన్‌లోని కార్యాలయంలో మహాసభల కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రజలకే సర్వాధికారాలు అనే నినాదంతో ఆవిర్భవించిన ఫార్వర్డ్ బ్లాక్.. 82 ఏళ్లను పూర్తిచేసుకుందని తెలిపారు. స్వాతంత్య్రోద్యమం నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం వరకు కీలక భూమిక పోషించిందని గుర్తుచేశారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయ సాధన కోసం, దేశ పునర్మాణానికి సోషలిస్టు విధానాలతో లౌకికత్వాన్ని పెంపొందించేందుకు, కుల, మత, వర్గ, రహిత సమాజం కోసం ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు జన్ను విశాల్ వినయ్, ప్రసాద్, అహ్మద్, సమీర్, అభిషేక్ పాల్గొన్నారు.

శివాజీ స్ఫూర్తితో ఆరెకుల ఐక్యత



సమావేశంలో మాట్లాడుతున్న శివాజీ

హన్మకొండ అర్బన్: ఆరెకుల ఐక్యతకు ఛత్రపతి శివాజీ స్ఫూర్తి కారణమని ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపెల్లి శివాజీ అన్నారు. బాలసముద్రంలోని ఆరె సంఘం భవనంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరెకుల సమస్యల పరిష్కారం కోసం అందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం సంఘం జిల్లా కమిటీ రూపొందించిన క్యాలెండర్‌ను శివాజీతో పాటు, జిల్లా అధ్యక్షుడు హింగే శివాజీ, రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

బాధితుడికి డాక్యుమెంట్ల అందజేత



డాక్యుమెంట్లు అందిస్తున్న డిపో మేనేజర్

హన్మకొండ: ఆర్టీసీ బస్సులో మరిచిపోయిన ప్లాట్స్ డాక్యుమెంట్లను తిరిగి ప్రయాణికుడికి ఆర్టీసీ అధికారులు అందించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం స్టేషన్‌ఘన్‌పూర్ మండలం పల్లగుట్టకు చెందిన మచ్చ ఎల్లయ్య ఈనెల 10న ఘట్‌కేసర్‌లో ఆర్టీసీ వరంగల్ –1 డిపోకు చెందిన బస్సు ఎక్కి స్టేషన్ ఘనపూర్ వరకు ప్రయాణించి బస్సులోనే డాక్యుమెంట్లు మరిచిపోయి దిగిపోయారు. బస్సులోనే డాక్యుమెంట్లు మరిచిపోయాయని డిపో అధికారులకు బాధితుడు తెలపగా, వాస్తవాలు పరిశీలించి ఎల్లయ్యకు పత్రాలు అప్పగించారు.

ప్రయాణికుడికి సామగ్రి అప్పగింత

కుటుంబ అవసరాల కోసం కొనుగోలు చేసిన కిరాణ సామగ్రిని ఆర్టీసీ బస్సులో వదిలేసి వెళ్లగా, ఆ సామాగ్రిని తిరిగి ప్రయాణికుడికి ఆర్టీసీ అధికారులు అప్పగించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం పందిళ్లకు చెందిన కానుగు మోహన్.. సిద్దిపేట నుంచి హనుమకొండకు వెళ్లే బస్సులో ఎక్కి పందిళ్ల వరకు టికెట్ తీసుకుని బస్సులోనే సామగ్రిని మరిచిపోయి దిగివెళ్లారు. వెంటనే తేరుకున్న సదరు ప్రయాణికుడు.. వరంగల్ –1 డిపో కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. ఈ సందర్భంగా బాధితుడికి సామగ్రిని ఆర్టీసీ మేనేజర్ శ్రీనివాస్ అందజేశారు.

ఉచిత విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

వరంగల్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న 100లోపు ఉచిత విద్యుత్ యూనిట్లను ఎస్సీలు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ ఎస్‌ఈ మధుసూదన్‌రావు అన్నారు. 13వ డివిజన్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చి వద్ద ఎస్సీ విద్యుత్ వినియోగదారులకు బుధవారం అవగాహన సదస్సు కల్పించారు. 100 యూనిట్ల లోపు ఉచిత కరెంటు పొందడానికి ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్, కరెంటు బిల్‌ను విద్యుత్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సురేష్ కుమార్‌జోషి, డీఈఈ మల్లికార్జున్, ఏడీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏఏఓ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.